ప్రభాత **జయభేరి** తెలుగు దినపత్రిక jayabheridaily.com
30-05-2024 గురువారం మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
సంపుటి : 01 | సంచిక : 279 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక జయభేరి చానల్లో నికార్సైన జర్నలిస్టులుగా నిలబడాలను కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
JB జయభేరి



# భారత్ 3వ ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం

11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను ముందు 5వ స్థానానికి తీసుకొచ్చాం. భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థను 3వ స్థానానికి చేర్చుతాం.

2 లో



# ఒకటో తేదీ నుంచి ఓ మోస్తరు వర్షాలు

- నేడు కేరళకు నైరుతి ఆగమనం..
- 2 రోజుల్లో రాయలసీమలో ప్రవేశించే అవకాశం
- స్వల్పంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

**జయభేరి, విశాఖపట్నం:**

నైరుతి రుతు పవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఒక రోజు ముందుగా అంటే గురువారానికే అవి కేరళను తాకుతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత రెండు రోజుల్లో ఏపీలోకి ప్రవేశించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నెల 31 లేదా వచ్చే నెల ఒకటో తేదీకల్లా రుతుపవనాలు రాయలసీమలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు దక్షిణ అరేబియా సముద్రంలోని ఎక్కువ ప్రాంతాలు, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతాల్లో విస్తరించాయి. వీటి పురోగమనం ఆశాజనకంగా ఉండడంతో గురువారం లక్షద్వీప్‌లోని కొన్ని ప్రాంతాలు, కేరళ, మరికొన్ని భాగాలు నైరుతి, మధ్య

...మిగతాది 2 లో

# రాష్ట్ర గేయం.. 2.30 నిమిషాలు!



- కుదించిన జయజయహే గేయాన్ని ఖరారు చేసిన సర్కారు
- అమరవీరులు, ఉద్యమకారులకు అండగా ఉంటామని వెల్లడి

**జయభేరి, హైదరాబాద్:**

రెండున్నర నిమిషాల నిడివికి కుదించిన 'జయజయహే తెలంగాణ' గీతాన్ని తెలంగాణ రాష్ట్ర అధికారిక గేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. 'జయజయహే తెలంగాణ' గేయం ఒరిజినల్ వెర్షన్‌లోని ఒకట్రెండు పదాలను తొలగించి.. స్వల్ప మార్పులు, చేర్పులు చేసి పదమూడున్నర నిమిషాల పూర్తి నిడివితో మరో వెర్షన్‌ను ఖరారు చేసింది. గేయ రచయిత అందెశ్రీ మార్గదర్శకత్వంలో, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందించగా.. ప్రముఖ గాయ నీ గాయకులతో రికార్డు చేసిన రెండు వెర్షన్ల రాష్ట్ర గేయాన్ని సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎం కీరవాణి సంగీత దర్శకత్వంలో గాయనీగాయకులు ఈ రెండు వెర్షన్ల గేయాన్ని లైవ్‌గా పాడి వినిపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజలను

...మిగతాది 2 లో



# కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీటి కష్టాలు

- ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేదు
- విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేదు : కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్ మే 29:**

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీటి కష్టాలు మొదలయ్యాయి. గత ఐదారు నెలల నుంచి రైతుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయాయి. పోని పండిన పంటలను కూడా కొనేందుకు ప్రభుత్వం ముందుకురాలేదు. దాంతో అకాల వర్షాలకు పంట తడిసిపోయింది. చివరకు మిగిలిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనే దిక్కు లేదు. ఇక ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు సంబంధించిన విత్తనాల కోసం రైతులు సీడ్ షాపు ముందు బారులు తీరుతున్నారు. విత్తనాల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల బాధలపై ట్వీట్ చేశారు.రాష్ట్రంలో ప్రభుత్వం

...మిగతాది 2 లో



# అరవింద్ కేజ్రీవాల్ కు భారీ షాక్

- మధ్యంతర బెయిల్ పొడిగింపు పిటిషన్ విచారణకు సుప్రీం నిరాకరణ

**- జయభేరి, న్యూ ఢిల్లీ మే 29:**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు భారీ షాక్ తగిలింది. తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజులు పొడిగించాలంటూ సుప్రీంకోర్టులో కేజ్రీ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. అయితే కేజ్రీవాల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకునేందుకు సుప్రీం నిరాకరించింది. ఆయన వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టబోమని బుధవారం స్పష్టం చేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించేందుకు కేజ్రీవాల్ ఇదివరకే అవకాశం ఇచ్చినందున ఈ పిటిషన్‌ను విచారించడం సాధ్యం కాదని కోర్టు రిజిస్ట్రీ తెలిపింది.'అంతకుముందు కేజ్రీ చేసిన అభ్యర్థనను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. పిటిషన్‌ను ఎప్పుడు విచారించాలన్న అంశంపై సీజేఐ చంద్రచూడ్ నిర్ణయం తీసుకుంటారని సుప్రీంకోర్ట్ వెకేషన్ బెంచ్ మంగళవారం వెల్లడించింది. ఈ పిటిషన్‌ను మధ్యంతర బెయిల్‌ను విచారిస్తున్న బెంచ్ ఉన్నప్పుడు గతవారమే ఎందుకు దాఖలు చేయలేదని కోర్టు ప్రశ్నించింది.కాగా, లిక్కర్ పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం మే 10న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూ 1 వరకూ బెయిల్ మంజూరు చేసింది. ఇక జూన్ 2న ఆయన లొంగిపోవాల్సి ఉంది. అయితే, తీవ్రమైన అనారోగ్య కారణాల దృష్ట్యా తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను మరో 7 రోజులు పొడిగించాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.




# కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు ఈసీ ఆదేశం

**జయభేరి, న్యూ ఢిల్లీ :**

దేశంలో సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు చేరడంతో వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. కౌంటింగ్ ఏర్పాట్లను న్యూ ఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను వేగంగా ప్రకటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు

...మిగతాది 2 లో

# సీతక్కకు లైన్ క్లియర్



**జయభేరి, వరంగల్, మే 29:**

ర్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ పీసీసీ అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తారు అనేది కాంగ్రెస్ వర్గాలలో టెన్షన్ కలిగిస్తోంది. ఇప్పటికీ ఈ సీటు తనకే ఇవ్వాలని భట్టి విక్రమార్క పట్టుబడుతున్న నేపథ్యంలో మరికొందరు సీనియర్ నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన మహేష్‌కుమార్ గౌడ్ పేరు సైతం తెరమీదకు వచ్చింది. ఇప్పటికే సీఎం స్థానం ఓసీ, డిప్యూటీ సీఎం, స్పీకర్ లు ఎస్సీలకు చెందినవారు కాగా

...మిగతాది 2 లో




# ఎన్నికల కోడ్ ముగియగానే రేషన్ కార్డులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ మే 29**

కొత్త రేషన్ కార్డులు ఎప్పుడొస్తాయా అని అతృతగా ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఈ మేరకు ఎన్నికల కోడ్ ముగియగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రకటిస్తూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా రేషన్ కార్డులు మాత్రం రాలేదు. సంక్షేమ పథకాలు లబ్ధిదారుడికి చేరాలంటే రేషన్ కార్డు తప్పనిసరి.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## భారత్ 3వ ఆర్థిక వ్యవస్థగా..

భారత్‌ను ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చుతామని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం చేశారు. ఆ దిశగా తాము అడుగులు వేస్తున్నామని, అందుకు తమ వద్ద రోడ్ మ్యాప్ ఉందన్నారు. ప్రధాని మోదీ కేంద్ర ప్రభుత్వ లక్ష్యాల గురించి మాట్లాడుతూ, '11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను ముందు 5వ స్థానానికి తీసుకొచ్చాం. భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థను 3వ స్థానానికి చేర్చుతాం. తాము కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో ఇది జరుగుతుంది. మా హయాంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో పాటు పేదలకు నిత్యావసర సరుకులు అందేలా పలు చర్యలు తీసుకున్నామని' వివరించారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చడంలో ఆర్థిక వృద్ధికి ప్రాముఖ్యత ఉందన్నారు. దేశం ఆర్థికంగా వృద్ధి చెందితేనే ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో భారత్‌ను 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉందని ప్రధాని మోదీ చెప్పారు. రెండంకెల స్థానం నుంచి 5వ ఆర్థిక వ్యవస్థగా అవతరించాం కానీ, 3వ స్థానానికి చేరుకోవడం అంత తేలిక కాదన్నారు. అయితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో గత దశాబ్దకాలం నుంచి కేంద్రం చేపట్టిన కార్యక్రమాలతో నమ్మకం పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాక ఎన్డీఏ 3.0లో మరిన్ని విజయాలకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు.వ్యవస్థలపై మరింత నమ్మకం పెరగడంతో ఏదైనా సాధించవచ్చు అని భావిస్తున్నాం. ఆర్థిక వ్యవస్థల్లో మరో అడుగు ముందుకు వేసేందుకు తమ ప్రభుత్వం మొత్తం పనిచేస్తోందన్నారు. అందుకుగానూ ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన టాస్క్‌లు ఇచ్చాం. కొత్త ప్రభుత్వం ఏర్పడినట్లుగా భావించి నిరంతరాయంగా శ్రమిస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు. అంకితభావం, నిబద్ధత ఉంటే కఠినమైన సవాళ్లను ఎదుర్కొని ఆశించిన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## ఓ మోస్తరు వర్షాలు

బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశం ఉంది. వారం ముందుగానే రుతుపవనాలు పురోగమిస్తుండడంతో ఈ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. రుతుపవనాల పురోగమనం, రెమల్ తుఫాన్ కారణంగా ప్రస్తుతం రోహిణీ కార్తె ఉన్నా దాని ప్రభావం పెద్దగా రాష్ట్రంపై పడలేదు. స్వల్పంగానే ఉష్ణోగ్రతలు పెరిగాయి. బుధవారం పలుచోట్ల 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా పోయిమలలో అత్యధికంగా 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా చిరుమామిళ్లలో 42.5, గరికపాడులో 42 డిగ్రీలు, విజయవాడలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వచ్చే రెండు రోజులు కూడా వాతావరణం ఈ మాదిరిగానే ఉండవచ్చని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

**ఒకటి నుంచి వర్షాలు..**

రాష్ట్రంలో జూన్ ఒకటో తేదీ నుంచి వర్షాలు కురవనున్నాయి. జూన్ ఒకటిన అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోను, జూన్ 2న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోను అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో గంటకు 3040 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల పిడుగులు కూడా సంభవిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

## రాష్ట్ర గేయం.. 2.30 నిమిషాలు!

ఉర్రూతలూగించిన జయజయహే తెలంగాణ గేయాన్ని సరికొత్త స్వరాలు, సంగీత బాణీలతో అద్భుతంగా తీర్చిదిద్దారని, మరోసారి ప్రజలను ఉర్రూతలూగించడం ఖాయమని ఆ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఇందులో మంత్రి జూపల్లి కృష్ణారావు, టీజేఎస్ అధినేత కోదండరాం, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ జేఏసీ చైర్మన్ కె.రఘు, తెలంగాణ అధికారిక చిహ్నం రూపొందిస్తున్న చిత్రకారుడు రుద్ర రాజేశం, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

**అధికారిక చిహ్నంలో మార్పులపైనా..**

తెలంగాణ తొలిదశ ఉద్యమం, అశోక చక్రం, వ్యవ సాయం, రాజ్యాంగాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ భేటీలో సూచించారు. చిత్రకారుడు రుద్ర రాజేశం రూపొందించిన పలు నమూనా చిహ్నాలను పరిశీలించి వాటిలో ఒకదానిని ఎంపిక చేశారని.. అందులో కొన్ని మార్పులను సూచించారని తెలిసింది. అయితే ఇదే అధికారిక చిహ్నమంటూ.. మూడు నమూనా చిహ్నాలు బుధవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటిలో దేనిని కూడా ఎంపిక చేయలేదని సీఎంఓ వర్గాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్ర గేయం, తెలంగాణ అధికారిక చిహ్నాన్ని జూన్ 2న దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆవిష్కరించనున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారులను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారి విషయంలో స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీ అమలుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. జూన్ 2న ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే దశాబ్ది వేడుకలకు తెలంగాణ తొలి, మలి విడత ఉద్యమకారులను ఆహ్వానించాలని నిర్ణయించామని తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, రాష్ట్ర గేయం, అధికారిక చిహ్నం రూపకల్పన అంశాలపై చర్చించేందుకు గురువారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో మిత్రపక్షాలు సీపీఐ, సీపీఎం, టీజేఎస్ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. మిత్రపక్షాల నేతల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశానికి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఆహ్వానించలేదు.

## రైతులకు కన్నీటి కష్టాలు


ఉన్నట్టా..? లేనట్టా..? అని ప్రశ్నించారు. విత్తనాల కోసం రైతులకు ఏమిటీ వెతలు..? అని నిలదీశారు. వ్యవసాయ పరిస్థితులను పర్యవేక్షించాలని వ్యవసాయ మంత్రి ఎక్కడ..? ముందుచూపు లేని ముఖ్యమంత్రి జాడేది..? అని నిలదీశారు కేటీఆర్. నిన్న.. ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..! నేడు.. విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు..!! పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి.. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు.తెల్లవారుజామున 4 గంటలకు లైన్‌లో నిలబడితే.. సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వలేరా..? గత పదేళ్లపాటు.. 10 నిమిషాల్లో అందిన విత్తనాలు.. ఇప్పుడు 10 గంటల పాటు పడిగాపులు పడినా అందించలేరా ?? అని నిలదీశారు కేటీఆర్. దేశం కడుపునింపే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. అన్నదాతకే తిండితిప్పలు లేకుండా చేస్తారా ?? కాంగ్రెస్ వచ్చింది.. కాటగలిసినం అంటున్న.. అన్నదాతలను ఇంకా అరిగోస పెట్టకండి..!! లేకపోతే.. రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదు..!! అని కేటీఆర్ హెచ్చరించారు.

## ఎన్నికల కోడ్ ముగియగానే..

కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం చేసింది. సంక్షేమ పథకాలు అందుకునే వారు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ రేషన్ కార్డు ఉంటేనే పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారంటీలకు అర్హులు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను జారీ చేయడానికి ముందుకొచ్చింది. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ఈ ప్రక్రియ మొదలుపెడతాం. రేషన్ కార్డులు లేక పేద, మధ్య తరగతి కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆ బాధలను తీర్చడానికి కొత్త రేషన్ కార్డులను జారీ చేసి వారికి కానుకగా ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోందని వివరించారు.

# మారనున్న హైదరాబాద్..
# మెగా హైదరాబాద్

**జయభేరి, హైదరాబాద్, మే 29:**



భాగ్యనగరానికి మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డు వరకూ జీహెచ్‌ఎంసీని విస్తరించేందుకు రేవంత్ సర్కార్ వడివడిగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను అన్నీ కలిపి మెగా గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై తుది నివేదికలు సైతం సిద్ధం అయినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం మెగా గ్రేటర్ ప్లాన్ ఓ కొలిక్కి రావచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ మహానగరం ఇప్పటికే ఎంత అభివృద్ధి చెందిందో తెలియనిది కాదు.రాష్ట్ర నలుమూలల నుంచి.. ఉపాధి కోసం ఎంతో మంది ప్రజలు ఇక్కడకు వస్తూ ఉంటారు. ఎంతో మందికి హైదరాబాద్ మహానగరం.. ఆశ్రయం ఇస్తూనే ఉంది. ఈ క్రమంలో.. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ నగరం.. మెగా గ్రేటర్ హైదరాబాద్ గా విస్తరించనుంది. ఆ దిశగా కాంగ్రెస్ సర్కార్ సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్లనుంది.ఇప్పటికే జీహెచ్‌ఎంసీ మాస్టర్ ప్లాన్, హెచ్‌ఎండీఏ మరో మాస్టర్ ప్లాన్, సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ వంటి ప్రణాళికలు ఇప్పటిదాకా అమలవుతున్నాయి. ఇప్పుడు వీటన్నింటి స్థానంలో సమగ్ర ప్రణాళిక తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ సర్కార్ అడుగులు వేస్తోంది. ఒకసారి మాస్టర్ ప్లాన్ కనుక ఫైనల్ అయితే అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుంది. దీనితో పర్యాటక రంగానికి, రియాలిటీ రంగానికి అది ఆదాయ వనరుగా మారుతుంది. రాబోయే 3040 సంవత్సరాల అవసరాలు తీర్చడంతో పాటు దేశ, విదేశీ నగరాలను మించి మహానగరాలకు ధీటుగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే దీనికోసం అన్ని విభాగాలను సమాయత్తం చేసింది. 2050 మాస్టర్ ప్లాన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇండస్ట్రీ వర్గాలు హర్షిస్తున్నాయి. పరిశ్రమలకు, ఫార్మాసిటీకి, ఐటీ పరిశ్రమలకు, గ్రీన్ జోన్‌కు, రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రియాల్టీ మార్కెట్ మరింత పెరిగే అవకాశముంది. వృద్ధికి ఆస్కారమున్న ప్రాంతాల్లో రియాల్టీ మార్కెట్ పెరగడంతో పాటు కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కూడా పెరిగే చాన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక సిటీకి సమగ్ర మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే రింగ్ రోడ్డు నుంచి సిటీకి, రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డుకు ప్రత్యేక కనెక్టివిటి పెరుగుతుంది. మెట్రో రైల్ కనెక్ట్ విషయంలో కూడా క్లారిటీ రావడమే కాకుండా ప్రాజెక్టుకు అడుగులు పడుతాయి. వీటితో పాటు తాగు, విద్యుత్ వంటి మౌలిక విషయాలలో ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ప్రకారం డెవలప్ చేయాల్సి ఉంటుంది. ఇక జీహెచ్‌ఎంసీ విషయానికి వస్తే 2007లో 12 మున్సిపాలిటీలు, 8 గ్రామ పంచాయితీలను కలిపి జీహెచ్‌ఎంసీని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సుమారు 1కోటి జనాభ ఉన్న కారణంగా.. 150 డివిజన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందుతున్నా కానీ.. హైదరాబాద్ చుట్టూ ఉన్న.. 21 పురపాలక సంఘాలలో మాత్రం ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతో.. ఇప్పుడు వాటిని కూడా డెవలప్ చేసి .. మెగా గ్రేటర్ హైదరాబాద్ గా రూపుదిద్దాలనే .. ఒక మాస్టర్ ప్లాన్ తో ముందుకు వెళ్తున్నారు అధికారులు..ప్రస్తుతం బల్దియా పరిధిలో 150 డివిజన్లు ఉన్నాయి. దాదాపు 74 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. జనాభా కోటి వరకు ఉంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను బల్దియాలో విలీనం చేస్తే జనాభా మరో 60 లక్షల వరకు పెరుగుతుంది. అదనంగా మరో 50 నుంచి 60 డివిజన్ల వరకు పెరుగుతాయని అధికారుల అంచనా. అప్పుడు 210 వరకూ డివిజన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మెగా గ్రేటర్ కు పెద్దగా ఉంటుందని భావించిన సీఎం రేవంత్ రెడ్డి దీనిని రెండు విభాగాలు గా చేయమని అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రస్తుతం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారనే చర్చ జరుగుతోంది. రాజధాని పరిధిలో ప్రస్తుతం 5 మాస్టర్ ప్లాన్లు ఉండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఐదింటిని విలీనం చేసి.. వచ్చే 30 ఏళ్లు అమలులో ఉండే విధంగా ఒకే మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారు. దీనికి అనుగుణంగానే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే సమయంలో గ్రేటర్‌ను కూడా విస్తరించాలని సీఎం భావించారు. ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న సంస్థలన్నింటికీ కలిపి మెగా గ్రేటర్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. 3 నెలల్లో దీనిపై ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించడంతో అధికారులు ప్రస్తుతం ఆ పనిలో ఉన్నారు.

## కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**



కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి గ్రామీణ ప్రాంతాల్లో 22 పాఠశాలల్లో 160.29.లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పన పనులను చేపట్టినట్లు తెలిపారు. పెద్దాపూర్ లో 12.25 లక్షల, నేరేడుపల్లి లో 15.27 లక్షలు వజినేపల్లి 4.87 లక్షలు, రాంపూర్ లో 6 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులు పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పనకు నిధులు వెచ్చించి ప్రభుత్వ బడులలో మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు పున ప్రారంభం నాటికి ఏ ఒక్క పని పెండింగ్ లేకుండా సంపూర్ణంగా పూర్తి చేసి ఆహ్లాదకరంగా తయారు చేయాలని అన్నారు. బడులు బాగుచేసుకోవడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, విద్యార్థులు భోజనం తదుపరి చేతులు కడుక్కోవడానికి హ్యాండ్ వాష్ ప్లాట్ ఫారం ఉండాలని పేర్కొన్నారు. మనమే విద్యార్థులమైతే ఎలాంటి సౌకర్యాలు ఉంటే బావుంటుందని కోరుకుంటామో అదే స్థాయిలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం, కనీస సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించాలని ఆయన సూచించారు. ఖర్చుకు వెనకాడకుండా జిల్లాలో మరమ్మత్తులు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అంధించేందు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు. నిధులు కొరత రాకుండా పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు మహిళా సంఘాలకు అంచనా ప్రతిపాదనలు మేరకు 25 శాతం ముందస్తు నిధులు మంజూరు చేశామని అన్నారు. చేపట్టిన పనులకు చెల్లించిన ప్రతి రూపాయి లెక్క పక్కాగా ఉండాలని, అందుకు రిజిస్టర్లలో నమోదులు చేయాలన్నారు. మరమ్మతులు చేపట్టకు ముందు, పనులు జరుగుతున్నపుడు, పనులు పూర్తి అయిన తదుపరి మూడు దశల ఫోటోలు భద్రపరచాలని తెలిపారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు ఈసీ ఆదేశం

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సూచించారు. జూన్ 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం జాప్యం చేయొద్దని సూచించారు. జూన్ 4న ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఏపీలో కొన్ని చోట్ల ఎన్నికలకు సంబంధించిన హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 20 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కేటాయించామని, పికెట్లు ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. సున్నితమైన కేంద్రాలను గుర్తించడంతో పాటు, సమస్యలు సృష్టిస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజు డ్రై డే, గా అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం అందుబాటులో ఉండదని సీఈఓ మీనా స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాక్అప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్సులను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబందించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే శిక్షణ నివ్వాలని, సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐటి, పరికాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల సిద్దంగా ఉంచుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు లెక్కించే ఈవీఎంలను ఎడా పెడా పడేయకుండా ఒక క్రమ పద్ధతిలో తీసుకురావడం, ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి లెక్కింపు పూర్తి అయినట్లుగా,ఆయా ఈవీఎం లపై మార్కు చేస్తూ వెంటనే వాటిని సీల్ చేసి ఒక క్రమపద్ధతిలో సురక్షితంగా భద్రపర్చాలని సూచించారు. అనవసరంగా ఈవీఎం లను అటూ ఇటూ తరలించొద్దని, ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టమ్, ఈటీపీబిఎంఎస్, ను చక్కగా నిర్వహించాలని, వాటి లెక్కింపుకు సంబందించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించే విషయంలో ఏమాత్రము ఆలశ్యం చేయవద్దని, డిస్‌ప్లే బోర్డుల ద్వారా ఎప్పటి కప్పుడు ఖచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలని సూచించారు.

**స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం..**

స్ట్రాంగ్ రూంల భద్రతకు 3 టైర్ భద్రతను ఏర్పాటు చేసినట్టు సీఈఓ తెలిపారు. ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమరాలను అమర్చామని, అభ్యర్థులు వారి తరుపున ప్రతినిధులు కానీ ఎప్పటికప్పుడు పరిశీలించుకునేందుకు డెక్ మెన్ హాలులో కంట్రోల్ రూంను కూడ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు లేదా వారి తరుపున ప్రతినిధులు కానీ రోజుకు రెండు సార్లు స్ట్రాంగ్ రూంలను ఫిజికల్ గా పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. పోలింగ్ తరువాత అక్కడక్కడ జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకొని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి 20 కంపెనీల బలగాలు కేటాయించటం జరిగిందని, రాష్ట్రంలో పికెట్లు ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, ఘర్షణలకు పాల్పడే అనుమానితులను గుర్తించి వారిపై అవసరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని చెప్పారు.

## సీతక్కకు లైన్ క్లియర్

ఈ సారి పీసీసీ అధ్యక్షుడిగా బీసీకి చెందిన అభ్యర్థిని ఎంచుకోవాలని పార్టీలో ఒత్తిడి పెరిగిపోతుండగా అనూహ్యంగా సీతక్క పేరు తెరపైకి వచ్చింది. ఆదివాసి మహిళకు పార్టీ పగ్గాలు ఇస్తే బాగుంటుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎందుకంటే బీసీ వర్గాల నుంచి మరొకరి పేరు కూడా వినిపిస్తోంది. అలాగే అద్దంకి దయాకర్, జగ్గారెడ్డి, మధు యాష్కి తదితర సీనియర్లంతా పీసీసీ పీఠం కోసం పట్టుబడుతుండగా... సీఎం రేవంత్ టీమ్ కు చెందిన ములుగు సీతక్కకి పీసీసీ ఇస్తే బాగుంటుందని అంతా అనుకుంటున్నారు. అయితే ఈ మేరకు సీతక్కకు అధిష్టానం నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. ఇక అధిష్టానం లాంఛనంగా సీతక్క పేరు ప్రకటించడమే తరువాయి.మహిళకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తే పార్టీకి సానుకూలత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పీసీసీ పదవి కోసం పోటీ పడుతున్న ఇతర నేతలు సైతం సీతక్క అనగానే ఏకాభిప్రాయానికి వస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఎందుకంటే సీతక్కపై అందరికీ సదభిప్రాయమే ఉంది. పార్టీ కోసం ఆమె కష్టపడి పనిచేస్తారనే నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాయి. సీతక్కకు పార్టీ పగ్గాలు అప్పగించడం ద్వారా ఎస్టీ సామాజిక వర్గం ఆదరణ పొందడమేగాకుండా, మహిళల నుంచి కూడా పార్టీకి సానుకూలత ఉంటుందని కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేసుకుంటోంది. పైగా పీసీసీ చీఫ్ గా పదవి ఇవ్వడం ద్వారా తెలంగాణ కాంగ్రెస్ కు తొలి ఆదివాసి మహిళగా గుర్తింపు ను ఇచ్చినట్లవుతుందని అధిష్టానం కూడా భావిస్తున్నట్లు సమాచారం. . ఆమెకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తే ఎవరి నుంచి వ్యతిరేకత రాదని కొందరి వాదన. అందుకే సీతక్క పేరును కాంగ్రెస్ పరిశీలిస్తుందని గాంధీ భవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సీతక్క. ఈ పేరు రెండు తెలుగురాష్ట్రాలలోనూ సుపరిచితమే. ఈమె అసలు పేరు ధనసరి అనసూయ సీతక్క. కానీ సీతక్కగానే ఆమె చిరపరిచితురాలు. పొలిటికల్ సైన్స్‌లో ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. సీతక్క తల్లిదండ్రులు సమ్మయ్య, సమ్మక్క. సీతక్కకు ఒక కుమారుడు ఉన్నారు.

పేరు సూర్య. గతంలో జనశక్తి గ్రూపులో దళసభ్యురాలుగా ఉన్న ఆమె, తను ప్రేమించిన శ్రీరాములునే పెళ్ళి చేసుకున్నారు. కానీ తరువాత విడిపోయారు. ఏ మార్పు కోసం తాను అడవి బాట పట్టానో, అడవిని వీడాకా కూడా తన లైను మార్చుకోలేదని ఆమె చెప్తుంటారు.అనసూయ మావోయిస్ట్ పార్టీలో చేరినప్పుడు పదో తరగతి చదువుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల పాటు మావోయిస్ట్ పార్టీలో పనిచేసిన సీతక్క తరువాత జనజీవన స్రవంతిలోకి వచ్చారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసేందుకు లా కూడా చదివారు.సీతక్క తెలుగుదేశం పార్టీ తరపున 2004లో ములుగు నుంచి పోటీ చేశారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థి పోడెం వీరయ్య చేతిలో ఓడిపోయారు. తరువాత 2009లో వీరయ్యపైనే గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపునే పోటీ చేశారు. కానీ టీఆర్ఎస్ అభ్యర్థి చందూలాల్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2018లో సీతక్క కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018, 2023 ములుగు నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. సీతక్క నిరాండబరత, సామాన్యుల్లో సామాన్యురాలిగా కలిసిపోయే స్వభావమే ఆమెకు ప్రత్యేకతను తీసుకువచ్చిందంటారు రాజకీయ విశ్లేషకులు.అయితే, పార్టీ పగ్గాలను సీతక్క చేపట్టేందుకు అంగీకరిస్తుందా..? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ పీసీసీగా ఒప్పుకుంటే మంత్రి పదవిలో కొనసాగుతారా? లేక రాజీనామా చేస్తారా అని చర్చలు జరుగుతున్నాయి.

# సమస్యలపై స్పందించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

- ఉప్పల్ భగాయత్ లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కనీసం రోడ్లు, పరిసర ప్రాంతాలు శుభ్రపరిచే పరిస్థితి లేదు
- ఏ రోడ్ లో చూసిన స్ట్రీట్ లైట్స్ వెలిగే పరిస్థితి లేదు
- రోడ్లపై అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న పట్టించుకోని పరిస్థితి

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ భగాయత్ లో ఉన్నటువంటి పలు సమస్యలపై ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం. బుధవారం ఉప్పల్ భగాయత్ లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలు తెలియజేశారు. జిహెచ్ఎంసి వారు హెచ్ఎండిఏ లేఔట్ లో ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తూ కనీసం రోడ్లు, పరిసర ప్రాంతాలు శుభ్రపరిచే పరిస్థితి లేదు లేఅవుట్ మొత్తం చెత్తతోనిండిపోయింది. లేఔట్ లో అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ డ్రైనేజ్ అవుట్ లెట్ కనెక్షన్ లేకపోవడంతో ఎక్కడకక్కడ మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. అదేవిధంగా లేఔట్ లో ఏ రోడ్ లో చూసిన స్ట్రీట్ లైట్స్ వెలిగే పరిస్థితి లేదు. రాత్రిపూట ఇళ్లల్లో దొంగలు పడటం అదేవిధంగా రోడ్లపై అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న పట్టించుకోని పరిస్థితి. అదేవిధంగా వర్షాలు పడుతున్నప్పుడు స్ట్రామ్ వాటర్ 80 ఫీట్ల రోడ్లపై పొంగి పొర్లుతున్న జిహెచ్ఎంసి వారు కానీ, వాటర్ వర్క్స్ వారు కానీ సమస్యను పరిష్కరించే పరిస్థితి లేదు. వీటితోపాటు ఇల్లు నిర్మించుకున్న భగాయత్ వాసులు కొత్తగా హౌస్ నెంబర్ కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి భగాయత్ పేరుతో కాకుండా చుట్టుపక్కల ఉండే కాలనీలా పేర్లతో అడ్రస్ లు ఇవ్వడం జరుగుతుంది. హెచ్ఎండిఏ వారు 433 ఎకరాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లేఅవుట్ కి భగయత్ పేరు కాకుండా చుట్టుపక్కల కాలనీల పేర్లు రావడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమస్యలన్నిటిని హెచ్ఎండిఏ వారి దృష్టికి తీసుకువెళ్తేవారు మా దగ్గర సంబంధిత సిబ్బంది (manpower) లేదు కావున జిహెచ్ఎంసి వారి దగ్గరికి వెళ్ళమంటారు. జిహెచ్ఎంసి వారి దృష్టికి తీసుకువెళ్తే వారు మాకు సంబంధం లేదు హెచ్ఎండిఏ వారు మాకు ఇంకా ఫైల్ అందజేయలేదని చెప్తు కాలయాపన చేస్తున్నారు. కానీ జిహెచ్ఎంసి వారు టాక్స్ వసూలు చేసే దానిపై పెట్టిన శ్రద్ధ సమస్యలు తీర్చే ప్రయత్నంలో పెట్టడం లేదని భగయత్ వాసులు వాపోతున్నారు. అటు హెచ్ఎండిఏ వారు ఇటు జిహెచ్ఎంసి వారికి మధ్యలో భగయత్ వాసులు అనేక తీరని సమస్యలతో నలిగిపోతున్నారు. కావున ఈ సమస్యలన్నిటిని ఎమ్మెల్యేకి వివరించడం జరిగింది. సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ వీలైనంత త్వరలో సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ భగయత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి, కమిటీ సభ్యులు గోనె అర్జున్ రెడ్డి, ఒక్కంటి శ్రీనివాసరావు, బంగ్లా శ్రీనివాస్ రెడ్డి, పిల్లి నాగరాజు, నవీన్, సురేందర్ రెడ్డి, చింతల నరసింహారెడ్డి, శోభ, రవళి తదితరులు పాల్గొన్నారు.



## కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడి

- రాష్ట్రంలో ఉన్నటువంటి ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలి
- డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**జయభేరి, హైదరాబాద్ :**

డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలనీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి గారిని కలిసి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడి చేస్తున్నాయి. యాజమాన్యకోట సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటూ విద్యా వ్యాపారం చేస్తున్నాయని, డిమాండ్ ఉన్న కోర్సు సీట్లకు ఇష్టానుసారంగా భారీగా ఫీజులు పెంచుతున్నారని, సీట్లను బ్లాక్ లో పెడుతూ మెరిట్ విద్యార్థులకు ఇవ్వకుండా లక్షల రూపాయల ఫీజులు కట్టేవారికి సీట్లు ఇస్తున్నారని కొన్ని కోర్సులకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఆ సీట్లకు అడ్మీషన్ల కొరత సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు రాబడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలు యాజమాన్య సీట్ల భర్తీలో భారీగా అక్రమాలు చేస్తున్నాయని అనేక ఇంజనీరింగ్ కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని అధికారులు తనిఖీలకు వెళ్ళే సమయంలోనే విద్యార్హత కలిగిన టీచింగ్ సిబ్బందిని తాత్కాలికంగా నియమించుకుంటూ అనంతరం విద్యార్హత లేనివారితో కళాశాలలు నిర్వాహణ చేస్తూ, పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు ఎండీ అన్వర్, హరీష్, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## కుక్క కోసం 100కి ఫోన్

**జయభేరి, వరంగల్, మే 29:**

వరంగల్‌లో ఓ వ్యక్తి పోలీసులకు ఊహించలేక షాక్ ఇచ్చాడు. ఇంట్లోకి చొరబడ్డ వీధి కుక్క ఎంతకు బయటికి వెళ్ళకపోవడంతో డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసులను తన ఇంటికి రప్పించాడు. ఆ కుక్కను వారిచేతే బయటకు వెళ్ళగొట్టించాడు. ఈ విచిత్ర సంఘటన ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాజీపేటలో జరిగింది. ఇంటి యజమాని రాజేంద్రకుమార్ నిర్వాకం చూసిన పోలీసులు బిత్తరపోయారు.ఇంట్లోకి వీధి కుక్కలు చొరబడితే సహజంగా కర్ర పట్టుకొని బెదిరిస్తాం. ఏదో ఒక విధంగా ఆ కుక్కను భయపెట్టించి బయటకు వెళ్లగొడతాం. కానీ వరంగల్ గిర్మాజీపేటకు చెందిన రాజేంద్రకుమార్ అనే వ్యక్తి మాత్రం తన ఇంట్లోకి చొరబడ్డ కుక్కని వెళ్ళగొట్టడం కోసం డయల్ 100 కి ఫోన్ చేసి పోలీసులను తన ఇంటికి రప్పించాడు. ఆ కుక్క ఎంతకు బయటికి వెళ్లడం లేదని, తరిమితే పైపైకి వచ్చి కరిచేందుకు యత్నిస్తోంది. మీరే వెళ్లగొట్టాలంటూ పోలీసులకు సూచించడం ఇప్పుడు ఓరుగల్లు హాట్ టాపిక్ అయింది.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి జేఏసీ

**జయభేరి**



తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. లేబర్ డిపార్ట్మెంటు లో జరుగుతున్న అవకతవకలపై కార్మికులు ఆవేదన చెందుతున్నారు. కార్మికుల స్కీముల మీద పెట్టిన కండిషన్లను లేబర్ డిపార్ట్మెంట్ సర్దిద్దాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షులు బి అనంతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డెలివరీ. బెనిఫిట్ .మ్యారేజ్ గిఫ్టులు .డెత్ క్లెయిమ్. యాక్సిడెంట్లు క్లెయిమ్. పేర్ల మీద ఆన్లైన్ చేయాలని అందులో ఉన్న సమస్యలను సరిదిద్దే బాధ్యత అధికారులు మీద ఉండాలని అన్నారు. కార్డు ఇచ్చేటప్పుడు లేని ఔకతోకలు స్కీములు చేసేటప్పుడు కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని రోజులు తరపడా ఆఫీసు చుట్టూ తిప్పుతున్నారని మాజీ బోర్డు కమిటీ మెంబర్ అనంతయ్య మండిపడ్డారు. కార్మికుడు పని బంద్ చేసుకొని ఆఫీస్ చుట్టూ తిరగడం వల్ల అప్పుల పాలవుతున్నారని రోజు కూలికి వెళ్తేనే వాళ్ళ పూట గడుస్తుందని అలాంటి వారికి సమస్యలు పరిష్కారం చేసేది





పోయి గుదిబండలా అధికారులు మారారని దుయ్యబట్టారు. సమస్యలు పరిష్కరించాలిని అధికారులకు వినతి పత్రం సమర్పించుకున్న కానీ సమస్యలు పరిష్కారం కావడం లేదు ఐదు నిమిషాలు పది నిమిషాలు టైం కేటాయిస్తే వాళ్ళ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

# చిరకాల స్వప్నం రాహుల్ గాంధీ ప్రధాని కావడమే

- రాహుల్ గాంధీ ప్రధాని కావాలనీ 3 వీలర్‌లో 3700కి.మీ. ప్రయాణించిన వికలాంగుడు

**జయభేరి, హైదరాబాద్ మే 29:**

కాగిత రాయప్ప, రాష్ట్ర జాయింట్ మాజీ కార్యదర్శి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ఆంధ్రప్రదేశ్, శారీరక వికలాంగుడు సీనియర్ కాంగ్రెస్ వాలంటీర్... కె. డేవిడ్ రాజు (అతనికి సహాయకుడు) ఇద్దరూ హైదరాబాద్ (తెలంగాణ) నుండి 3 వీలర్‌పై ప్రయాణించారు. రాష్ట్రం నుండి వాయనాడు (కేరళ) నియోజకవర్గం 1604 2024 నుండి 22042024 వరకు 2024లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం నిర్వహించారు సార్వత్రిక ఎన్నికల కొరకు. ఆయన చిరకాల స్వప్నం రాహుల్ గాంధీ ప్రధాని కావడమే.వివరాలలోకి వెళితే కాగిత రాయప్ప, తండ్రి వెంకట రెడ్డి కాంగ్రెస్ పార్టీ సిన్సియర్ వాలంటీర్. అతను 25 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నాడు, కాంగ్రెస్ పార్టీకి అతనొక్కడేఅంకితం చేయడమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా ఆరు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారు, ఇప్పుడు అతను తెలంగాణా రాష్ట్రంలోని కాజీపేట (సోదరి ఇల్లు)లో నివసిస్తున్నారు.గతంలో 1996 నుండి 2000 వరకు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, 20002009లో కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ నాయకుడిగా, తూర్పుగోదావరి జిల్లా, 20092014లో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా, వికలాంగుల సెల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. 2012 నుండి 2014 వరకు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి చెందిన ఆయన కాంగ్రెస్ పార్టీకి కొత్త సభ్యుల చేరిక కోసం కాంగ్రెస్ పార్టీ తరపున అనేక శిబిరాలు నిర్వహించారు. అందుకే ఆయన సేవలను



కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తించి బొత్స సత్యనారాయణ , ప్రెసిడెంట్ (PCC), 2014 సంవత్సరంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసే అవకాశం ఇచ్చారు. ఇంతలో, అతను 2019 సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికలలో ప్రచారం చేసిన కారణంగా 2019 సంవత్సరంలో విజయవాడ నుండి న్యూఢిల్లీ నుండి 3 వీలర్‌లో 2500 కి.మీ.ల దూరం 5 రాష్ట్రాలను, అంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర,మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ & న్యూఢిల్లీలను కవర్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రాయప్ప. అదేవిధంగా, ప్రస్తుతం కూడా ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ నుండి వయనాడ్ కేరళ రాష్ట్రం (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక & కేరళ మరియు 1200 కి.మీ.లు) ప్రయాణించారు, వారీ ప్రియతమ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ. . రాహుల్ గాంధీజీ భారతదేశానికి ప్రధానమంత్రి కావాలనీ.అవార్డులు రివార్డులు:అతని ప్రయాణానికి సంబంధించినది ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2021 అద్భుతంగా గుర్తించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2022, మరియు అతని పేరు అక్కడ నమోదు చేయబడింది, అదనంగా, అతను డా. B.R.అంబేద్కర్ జాతీయ అవార్డు (సామాజిక సేవ) న్యూఢిల్లీ 2023, కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డ్స్ 2024కావున, ఆయన సేవలను దయతో గుర్తించి, దివ్యాంగుల సెల్ ఆధ్వర్యంలోని అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఛైర్మన్‌గా ఇవ్వాలని ఆయన కాంగ్రెస్ పార్టీని అధిష్టానాన్ని అభ్యర్థించారు.హైకమాండ్ తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు, పార్టీ ఉన్నతాధికారులను ప్రార్థించారు, వారి గుర్తింపు తనకు గొప్ప భాగ్యం అని పేర్కొన్నారు. రాయ్యప్ప కు మంచి కుటుంబ నేపథ్యం ఉంది. అతని తండ్రి కి"శే కాగిత వెంకట్ రెడ్డి విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తల్లి స్వర్గీయ సత్యవతి గారు విశ్రాంత సెకండరీ గ్రేడ్ టీచర్ , అంతే కాక వారి మేన మామలకు రాజకీయ నేపథ్యం ఉంది, బత్తిన సుబ్బా రావు గారు మాజీ మంత్రి వర్యులు పూర్వ ఆంధ్రప్రదేశ్ లో. వుండ్రు కి||శె కృష్ణారావు మాజీ ఎమ్మెల్యే తూర్పు గోదావరి జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించారు



## సంత్ సేవాలాల్ జీవితం అందరికీ అనుసరణీయం

- దేవరయాంజాల్ లో సేవా లాల్ మహారాజ్ ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి సీతక్క

**జయభేరి, మే 29:**

సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా, దేవరయాంజాల్ లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని మంత్రి సీతక్క సందర్శించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లు, అవరోధాలను అధిగమించి సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సంస్కర్తగా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. అయన చూపిన భక్తి మార్గంలో నడుచుకుంటూ సమాజ సేవలో పాలు పంచుకోవాలని సూచించారు.

## యాదాద్రి లక్ష్మీనర్సింహ్మా స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ్మా స్వామిని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు, అనుగ్రహం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. స్వామివారి దీవేనలతో మరింత ముందుకు వెళ్తానని అన్నారు.దేవరకొండ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీవారిని కోరినట్లు తెలిపారు.

## ఈనెల 31న పట్టుబడిన వాహనాల వేలం



**జయభేరి, దేవరకొండ :**

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఈనెల 31న వేలం వేయడం జరుగుతుందని, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ దేవరకొండ ఆవరణలో ఉన్నత అధికారుల ఆధ్వర్యంలో ఈ వేలం పాటను నిర్వహించబడుతుందని, ఆసక్తి గలవారు ప్రభుత్వం ద్వారా నిర్దేశించబడిన ధరావత్తు సొమ్మును చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనమునకు పదివేల రూపాయలు, నాలుగు చక్రాల వాహనములకు 30,000 రూపాయలు ఉదయం ఎనిమిది గంటల లోపు డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. వేలం పాటలో వాహనం దక్కించుకొని వారికి తమ డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని అన్నారు. ఇట్టి వేలం పాటలో ఆసక్తిగలవారు ఈనెల 31వ తారీకు 8 గంటల లోపు తమ పేరు నమోదు చేసుకోవాలని ఇన్స్పెక్టర్ శ్రీనివాస తెలిపారు.

## అనారోగ్యంతో మృతి చెందిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**జయభేరి, కొండమల్లేపల్లి :**

అనారోగ్యంతో మృతి చెందిన చిన్ననాటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన జాగటి యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి చిన్ననాటి పదవ తరగతి మిత్రులు బుధవారం రోజు ఆయన కుటుంబ సభ్యులను కలిసి 50 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందించారు అనారోగ్యంతో మృతి చెందిన తమ స్నేహితుడి యొక్క కుటుంబానికి తమవంతుగా ఎంతో కొంత ఆర్థిక సహాయం చేసి తమ కుటుంబానికి బాసటగా నిలవడంతో వారి కుటుంబ సభ్యులు చిన్ననాటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం మిత్రులు చేయడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని కలిసిన స్నేహితులలో వెంకటమ్మ, హనుమంతు, శ్రీనివాస్, అంజయ్య, వెంకటరమణ, చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్ తదితరులు ఉన్నారు.



# నటి హేమకు మరోసారి నోటీసులు జారీ

జయభేరి, బెంగళూరు, మే 29 :

టాలీవుడ్ నటి హేమకు మరోసారి బెంగళూరు పోలీసుల నోటీసులు జారీ చేశారు. రేవ్ పార్టీ కేసులో జూన్ 1న విచారణకు హాజరుకావాలంటూ సిసిబి పోలీసులు నోటీసులు జారీ చేశారు. బెంగుళూరు రేవ్ పార్టీలో ప్రముఖ తెలుగు నటి హేమతోపాటు పలువురు నటులు పాల్గొన్న సంగతి తెలిసిందే. నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ తీసుకున్నట్టుగా తేలింది. దాదాపు 150 మంది రక్త నమూనాలను నార్కోటిక్ టీమ్ సేకరించి పరీక్షించింది ఈ రక్త నమూనాలో 59 మంది పురుషులు, 27 మంది మహిళలు.. మొత్తం 86 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు నార్కోటిక్ టీమ్ వెల్లడించింది. ఈ క్రమంలో నటి హేమ సోమవారం బెంగళూరు పోలీసుల ముందు హాజరు కావల్సి ఉంది. అయితే హేమ పోలీసుల ముందు హాజరు కాకుండా వారికి ఒక లేఖ రాశారు. తాను వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నానని చెప్పిన నటి హేమ ఇప్పుడు తాను విచారణ కు హాజరు కాలేనని లేఖలో రాశారు. దీంతో మళ్లీ ఆమెకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

# కేసీఆర్ ముద్ర చెరిపేసేందుకు... 3 నిర్ణయాలు



జయభేరి, హైదరాబాద్, మే 29:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచింది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పదేళ్లు అధికారంలో ఉండి గద్దె దిగే వరకు కేసీఆర్ తనదైన ముద్ర వేశారు. తెలంగాణ పితగా సొంత పార్టీ నేతలు కీర్తిస్తూ.. ఆ అభిప్రాయాన్ని ప్రజల్లోకి జొప్పించే ప్రయత్నం చేశారు. దీంతో కేసీఆర్‌కు తెలంగాణలో ప్రత్యేక ఇమేజ్ ఉంది. గతేడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కేసీఆర్ ముద్ర చెరిపేసే ప్రయత్నాలు చేపట్టారు. ప్రభుత్వాలు మారితే విధానాలు మారడం తెలుగు రాష్ట్రాల్లోనే జరుగుతోంది. ఏపీలో చంద్రబాబు నాయకుడు అమరావతి రాజధానిగా చరిత్రలో నిలిచిపోవాలనుకున్నారు. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. చంద్రబాబు ముద్ర చెరిపేలా మూడు రాజధానుల అంశం తెరపైకి తెచ్చారు. చంద్రబాబు విధానాలను మార్చారు. విశాఖను ప్రధాన రాజధానిగా మార్చాలని ప్రయత్నిస్తూ తద్వారా తన ముద్ర వేసుకోవాలని సూస్తున్నారు. ఈక్రమంలో జగన్ తీరును విమర్శించిన టీడీపీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు చెబుతోంది. ఏపీలో చంద్రబాబు, జగన్ తరహాలోనే తెలంగాణలో రేవంత్‌రెడ్డి కూడా మాజీ సీఎం ముద్రను చెరిపేసేలా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఓ కొలిక్కి తెచ్చారు. తెలంగాణ తల్లికి తుదిరూపు ఇచ్చారు. ఇప్పుడు తెలంగాణ అధికారిక చిహ్నం విషయంలోనూ కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటేలా చిత్రకారుడు రుద్ర రాజేశ్‌తో చర్చలు జరిపారు. కీలక సూచనలు చేశారు. ఇదే సమయంలో తెలంగాణ జాతిపితగా జయశంకర్‌ను తెరపైకి తెచ్చారు. మొత్తంగా కేసీఆర్ ముద్ర లేకుండా చేస్తున్నారు. తద్వారా తెలంగాణలో అధికారం మారితే విధానాలు మారతాయన్న సంకేతం ఇస్తున్నారు. రెండు రాష్ట్రాలో ఇలాగే వ్యవహరిస్తుండడం చర్చనీయాంశం అవుతోంది. ఇదిలా ఉంటే.. తెలంగాణలో కేసీఆర్ స్థానం ఆక్రమించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఇది అంత ఈజీ కాదంటున్నారు. విధానపరమైన మార్పులు చేసినంత మాత్రాన ఒకరి గుర్తింపును చెరిపేయాలని భావించడం సరికాదంటున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు తమిళనాట ఉండేవని, ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు ఆ సంస్కృతి మారడం మంచిది కాదని పేర్కొంటున్నారు. కేసీఆర్ ముద్ర చెరిపేయాలని రేవంత్ ప్రయత్నిస్తున్నా.. కేసీఆర్ స్థాయిలో గుర్తింపు రావడం కష్టమని పేర్కొంటున్నారు.

# రోడ్డు ప్రమాదంలో తల్లీ ఇద్దరు పిల్లలు దుర్మరణం

ఖమ్మం:

ఖమ్మం జిల్లా రఘునాధాపాలెం మండలం హర్యాతండా వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు పిల్లలతోతల్లి మృతి చెందారు. మృతులు బోడ కృషిక (5), క్రితన్య(2)తో సహా తల్లి కుమారి(25)గా గుర్తించార. .ఉద్దేశ్య పూర్వకంగానే కుమారి భర్త బొడా ప్రవీణ్ ఆక్సిడెంట్ చేసినట్లు బంధువులు ఆరోపించారు. .కావాలనే చంపి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.ఘటనలో ...భర్త ప్రవీణ్ పరిస్థితి కూడా విషమంగా వుంది. వారంతా స్వగ్రామానికి వస్తుండగా ఘటన జరిగింది. .గత కొద్ది నెలలుగా భార్యాభర్తల మధ్య తీవ్ర విభేదాలున్నట్టు బంధువులు చెబుతున్నారు. .భర్త బొడా ప్రవీణ్ హైదరాబాద్ ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా పనిచేస్తున్నాడు.

# నగర శివార్లలో మహిళలకు కూరగాయల సాగు శిక్షణ కోసం

**FLO హైదరాబాద్ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రైనింగ్ ఉమెన్ వెజిటబుల్ ఫార్మింగ్'ను ప్రారంభించింది. FLO హైదరాబాద్, ఈస్ట్‌వెస్ట్ సీడ్ నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్ ఫౌండేషన్ ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. దాని ద్వారా 100 మంది మహిళా రైతులకు వాణిజ్య కూరగాయల సాగులో శిక్షణ ఇవ్వనున్నారు. దాదాపు 50 హైబ్రిడ్ రకాల కూరగాయలు, ఆకుకూరలను పండించడం, నిర్వహించడంలో వారికి శిక్షణ ఇవ్వబడుతుంది.**






జయభేరి, హైదరాబాద్, మే 29:

FLO హైదరాబాద్ మేడ్చల్ జిల్లా, రావల్‌కోల్ విలేజ్‌లో నగర శివార్లలో మహిళలకు కూరగాయల సాగు శిక్షణ కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ని ప్రారంభించింది. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (FLO) హైదరాబాద్, ఈస్ట్‌వెస్ట్ సీడ్ నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్ ఫౌండేషన్ బుధవారం నాడు 100 మంది మహిళా రైతులకు వాణిజ్య కూరగాయల సాగులో శిక్షణ ఇచ్చేందుకు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దాదాపు 50 హైబ్రిడ్ రకాల కూరగాయలు, ఆకుకూరలను పండించడం, నిర్వహించడంలో వారికి శిక్షణ ఇవ్వబడుతుంది.

తదుపరి మూడు పంట సీజన్లలో, FLO హైదరాబాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 100 మంది మహిళా రైతులకు సమర్థవంతమైన, లాభదాయకమైన మరియు స్థిరమైన కూరగాయల వ్యవసాయం యొక్క కళ, శాస్త్రంలో శిక్షణ ఇస్తుంది. మిరపకాయ, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, రిడ్జ్ గోర్డ్, దోసకాయ, గుమ్మడికాయ, ఎర్ర సొరకాయ, ఓక్రా, ఉల్లిపాయలు, దాదాపు 50 రకాల కూరగాయలు, ఆకుకూరల సాగు, నిర్వహణ, కోయడంపై వారికి శిక్షణ ఇవ్వబడుతుంది.

ఈ మహిళలు వ్యవసాయంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోడమే కాకుండా, స్వయంగా శిక్షకులుగా తయారవుతారు, వారి జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని వారి కమ్యూనిటీలోని ఇతరులకు వ్యాప్తి చేసి, స్వయం సమృద్ధిని సృష్టిస్తారు.

మహిళా రైతులకు పంట వైవిధ్యాన్ని పెంపొందించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, నీటి సామర్థ్యాన్ని నిర్ధారించడానికి అధునాతన సాంకేతికతలను నేర్పిస్తారు. ఈ స్థిరమైన వ్యవసాయ పద్ధతులు పర్యావరణానికి కూడా ప్రయోజనం చేకూరుస్తాయి, మరింత స్థితిస్థాపకంగా, ఉత్పాదక వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తాయి.

వ్యవసాయంలో నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా, 100 మంది మహిళా రైతుల్లో వ్యవస్థాపక నైపుణ్యాల అభివృద్ధిపై కూడా FLO దృష్టి సారిస్తుంది. డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యత తరగతుల ద్వారా, వారు తమ వ్యవసాయ వెంచర్లను సమర్థవంతంగా నిర్వహించడానికి, అభివృద్ధి చేయడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకుంటారు. ఈ జ్ఞానం వారి ఆర్థిక భవిష్యత్తును నియంత్రించడానికి, స్థిరమైన వ్యాపారాలను నిర్మించడానికి వారికి శక్తినిస్తుంది.

మహిళా రైతులు కీలకమైన ఆరోగ్య, పోషకాహార సలహాలు, ఆరోగ్య తనిఖీలను కూడా పొందుతారు, తద్వారా వారు, వారి కుటుంబాలు ముఖ్యంగా మహిళా సభ్యులు - ఆరోగ్యకరమైన, మెరుగైన జీవన ప్రమాణాన్ని పొందగలరు.

# తెలంగాణ అధికారిక చిహ్నంలో అలజడి



ఆలేటి రమేశ్
99487 98982

జయభేరి, హైదరాబాద్ :

కాకతీయుల పేరు వినగానే ముందుగా మన మన మదిలో మేదిలేది కాకతీయ కీర్తి తోరణం,కాకతీయ కళా తోరణం,స్వాగత తోరణం, ద్వార తోరణం,విజయ తోరణం ఇలా అనేక పేర్లతో పిలవబడే నాలుగు కాకతీయ తోరణాలు నాటి కాకతీయుల కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనం.. తెలంగాణగా ప్రజల ముఖ్యంగా మన ఓరుగల్లు ప్రజల ఆత్మ గౌరవ ప్రతీక అయిన అలాంటి అధికార చిహ్నం తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి అంటే బాధాకర విషయం.

కాకతీయ కళా తోరణం అనేది సాధారణ శకం యొక్క రెండవ సహస్రాబ్ది మొదటి కొన్ని శతాబ్దాలలో నిర్మించిన గొప్ప వరంగల్ కోటలో ఒక భాగమైన అలంకారమైన రాతి తోరణాల సమితి. రాతి తోరణ ద్వారాలు చాలా బాగా నిర్మించబడ్డాయి, వాస్తవానికి కాకతీయుల పాలనలో ఈ ప్రాంతంలో నిర్మించిన గొప్ప శివాలయంలో భాగంగా ఉన్నాయి. ఈ కారణంగానే ఈ కట్టడాలను కాకతీయ కళా తోరణం అని పిలుస్తారు. లేదా శక్తివంతమైన వరంగల్ గేట్ అని పిలుస్తారు. పురాణాల ప్రకారం, ఈ ప్రాంతం దక్షిణ భారతదేశంలోని అత్యంత ఆచరణాత్మక హిందూ రాజవంశం, కాకతీయ రాజవంశం యొక్క నివాసంగా ఉంది. చరిత్ర ప్రకారం కాకతీయ కళా తోరణం మొదటగా కటతీయ వంశానికి చెందిన గణపతిదేవుడు నిర్మించిన శివాలయం ద్వారా నిర్మించబడింది. తరువాత వరంగల్ కోట రుద్రమ దేవి, రెండవ ప్రతాప్ రుద్రను పటిష్టం చేసేందుకు ఈ ద్వారాలను ప్రస్తుత స్థితికి చేర్చారు. 14వ శతాబ్దం CEలో ముస్లిన్ దండయాత్ర తరువాత, చాలా నిర్మాణాలు ధ్వంసమయ్యాయి, గేట్లను మినహాయించి వాటి ప్రాముఖ్యతను సంతరించుకుంది. కాకతీయ కళా తోరణం చాలా దృఢంగా నిర్మించబడిన నాలుగు దృఢమైన స్తంభాలతో కళతో కూడిన సొగసైన తల పైభాగాన్ని కలిగి ఉంది. ద్వారాలలోని శాసనాలు భూమి వైభవాన్ని చాటిచెబుతున్నాయి. కాకతీయ కళా తోరణం లేదా రాతి తోరణం వరంగల్ గేట్ పర్యాటక సందర్శనలకు చాలా ప్రసిద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని చూడటం ద్వారా సులభంగా చేరుకోవచ్చు. కాకతీయ కళా తోరణం యునెస్కో అందించిన ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో కూడా చేర్చబడింది.






ముఖద్వారాల రూపకల్పన సాంచి వద్ద ఉన్న గొప్ప స్థూపం యొక్క 'తోరణాలు' వలె ఎర్రగా ఉంటుంది. ఈ ఆలయాల వాస్తుశిల్పం, శిల్పకళ అద్భుతంగా ఉన్నాయి, ఎందుకంటే కాకతీయుల కాలం నాటి దేవాలయాల నిర్మాతల గొప్ప ఊహ, సహనంతో కూడిన పరిశ్రమ, నైపుణ్యంతో కూడిన పనితనాన్ని ఎవరూ చూడలేరు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు ప్రపంచం గర్వించదగ్గ కళాకారుడు ఏలే లక్ష్మణ్ రూపొందించిన తెలంగాణ అధికారిక చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణం ఉండటం ఈ ప్రాంతపు గంగా జమునా తెహజీబ్ కు, ఘన వారసత్వానికి ప్రతీక. కాకతీయులు తవ్వించిన చెరువులను తుడిచేస్తరా, విద్వంసం చేస్తారా..? పాకాల చెరువును విద్వంసం చేస్తరా.. యునెస్కో గుర్తించిన రామప్ప కట్టడాలను చరిత్రలో లేకుండా చేస్తరా.. ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయాన్ని విద్వంసం చేస్తరా..?

అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించారు.. స్వాగతం.. కానీ అదే పాటలో '' కాకతీయ కళా ప్రభల క్రాంతిరేఖ రామప్ప, గోలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్" అంటూ వారు సంబోధించారు. అలా సంబోధించిన గీతాన్ని రాష్ట్ర గీతంగా తీసుకున్నప్పుడు తెలంగాణ చరిత్రకు సాక్షాలైన కాకతీయ తోరణం, చార్మినార్ ను తొలగించాలనే నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనా విధానానికి, అవగాహన రాహిత్యానికి, పరిపక్వతకు అద్దం పడుతుంది. కాకతీయ కళా తోరణం..

మన మహోన్నత చరితకు మహోజ్వల వైభవానికి ఆనవాళ్లు కాకతీయులు. శతాబ్దాలు గడిచినా మరవలేని మేలు చేసిన జనరంజక పాలకులు. ఆలయాలు జలాశయాలు నిర్మించి మన కీర్తి, మన ఖ్యాతి ప్రపంచానికి చాటిన నాయకులు. ఊరూరా సముద్రాలు తవ్వించి దక్కన్ భూముల్లో నీళ్లు పారించిన జల విజ్ఞాన సంపన్నులు గొప్ప దార్శనికతతో గొలుసు కట్టు చెరువులు నిర్మించి తెలంగాణకు అన్నం పెట్టిన పుణ్యం రామప్ప ఆలయం పేరిణి నృత్యం.. అమోఘం శిల్పకళా నైపుణ్యం. నిలాంటి నియంతలు అందరు కాలగర్భంలో కలిసిపోయినా ఇంకా వేలుగు జీలుగులతో విరాజిల్లుతోంది. చార్మినార్, కాకతీయ తోరణం రాచరికపు ఆనవాళ్లు కనుక తెలంగాణ అధికారిక చిహ్నం మార్పు అనేది ఘోరం.. దీన్ని తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలి.




# మెత్తానీ పత్తిపువ్వులాంటోడు నా సామి..

‘పుష్ప2’ (ది రూల్) చిత్రం కోసం దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. బుధవారం ఈ చిత్రం నుంచి ‘సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాదే నా సామి’ లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన ఈ పాట ప్రోమో సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ పాటకు దేవిశ్రీప్రసాద్ స్వరాలను సమకూర్చగా చంద్రబోస్ రచన చేశారు. పుష్పరాజ్ మీద శ్రీవల్లి మనసులోని ప్రేమను, ఆరాధనా భావాన్ని వ్యక్తం చేస్తూ చక్కటి సాహిత్యంతో ఈ పాట ఆకట్టుకుంటున్నది. ‘వీడు మొరటోడు అని వాళ్లు వీళ్లు..ఎన్నెన్ని అన్న పసిపిల్లవాడు నా వాడు..వీడు మొండోడు అని ఊరు వాడ అనుకున్నాగానీ మహరాజు నాకు నా వాడు..ఓ మాట పెలుసైనా..మనసు వెన్న..రా యిలా ఉన్నవాడిలోన దేవుదెవరికి తెలుసు నా కన్నా.. సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉం టాదే నా సా మీ..మెత్తానీ పత్తిపువ్వులా మరి సంటోడే నా సా మీ’ అంటూ అద్భుతమైన భావాలతో ఈ పాట సాగింది. ఐదు భాషల్లో శ్రేయా ఘోషల్ ఆలపించింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.







# మా బుజ్జిని నడపండి..

## ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం!

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ సైన్స్‌ఫిక్షన్ చిత్రం ‘కల్కి 2898ఏడీ’ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ వాడిన కారు ‘బుజ్జి’ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. కొద్ది రోజుల క్రితం జరిగిన భారీ ఈవెంట్‌లో ఈ కారును పరిచయం చేశారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ కారు వివిధ నగరాల్లో సందడి చేస్తున్నది. తాజాగా చెన్నై రోడ్లపై ఈ కారు విహరిస్తున్న ఫొటోలపై దర్శకుడు నాగ్‌అశ్విన్ స్పందించారు. తన ట్విట్టర్ ఖాతాలో ఈ ఫొటోలను పోస్ట్ చేసిన ఆయన ‘బుజ్జి’ వాహనాన్ని నడపాలంటూ టెస్లా కంపెనీ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను కోరారు. ‘డియర్ ఎలాన్ మస్క్ సర్.. మీరు భారత్‌కు వచ్చి మా బుజ్జిని నడపాలని కోరుకుంటున్నాం. ఇదొక ఇంజనీరింగ్ అద్భుతం. పూర్తిగా ఎలక్ట్రిక్ కారు. ఇండియాలోనే తయారు చేశాం. దీని బరువు ఆరు టన్నులు. మీ కంపెనీ టెస్లా తయారు చేసిన సైబర్‌ట్రక్, బుజ్జి కలిసి ప్రయాణం చేస్తే చూడముచ్చటగా ఉంటుంది’ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఒకవేళ దీనిపై ఎలాన్ మస్క్ స్పందిస్తే ‘కల్కి’ చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో కావాల్సినంత ప్రచారం జరుగుతుందని అభిమానులు అనుకుంటున్నారు. ‘కల్కి 2898’ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్, దిశాపటానీ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.



# అరుదైన గౌరవం

బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్ ఇండస్ట్రీలో రాణిస్తూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకుంది అగ్ర కథానాయిక దీపికా పడుకోన్. ‘ఓం శాంతి ఓం’ చిత్రంతో హిందీలోకి అరంగేట్రం చేసిన ఈ భామ అక్కడ అనేక హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. హాలీవుడ్ సినిమాలతో అంతర్జాతీయంగా పేరు తెచ్చుకుంది. తాజాగా ఈ మంగళూరు సోయగం అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. అంతర్జాతీయంగా పేరొందిన ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎమ్‌డీబీ గత దశాబ్దకాలంలో విశేష ప్రజాదరణ పొందిన భారతీయ నటీనటుల జాబితాను విడుదల చేసింది. ఇందులో దీపికా పడుకోన్ తొలిస్థానంలో నిలిచింది. సమంత 13న స్థానంలో ఉంది. ‘టాప్ 100 మోస్ట్ వ్యూడ్ ఇండియన్ స్టార్స్’ పేరుతో గత పదేళ్ల కాలంలో పాపులర్ అయిన సినీ తారల జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ఇందులో అనేక మంది అగ్ర తారలను అధిగమించి దీపికా పడుకోన్ నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ గుర్తింపు తనకు ఎంతో ప్రత్యేకమైనదని, ప్రపంచ వ్యాప్తంగా ఇంతమంది ప్రేమను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని దీపికా పడుకోన్ ఆనందం వ్యక్తం చేసింది.

# చెంగల్వ చేయందేనా..

కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘భారతీయుడు2’. 1996లో సంచలనం సృష్టించిన ‘భారతీయుడు’ చిత్రానికి సీక్వెల్ ఇది. జూలై 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. జూన్ 1న చెన్నైలో ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలుపెట్టారు. బుధవారం రెండో సింగిల్ ‘చెంగల్వ చేయందేనా..’ అనే పాటను విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ సంగీత సారథ్యంలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ గీతాన్ని అబ్బి, శృతికా సముద్రాల ఆలపించారు. సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్‌లపై చిత్రీకరించిన ఈ పాట చక్కటి మెలోడీగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సీక్వెల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ కనిపించనున్నారు. ఎస్.జె.సూర్య, సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్, జయరాం, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బాబీ సింహా, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: రవివర్మన్, ఎడిటింగ్: ఎ.శ్రీకర్‌ప్రసాద్. నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ ప్రొడక్షన్స్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com